# తీరని కోరిక

## — రంగనాథ్

"మై లైఫ్ అండ్ ప్రొఫెసీజ్" అనే గ్రంథాన్ని రచించిన ప్రపంచ ప్రసిద్ధ రచయిత్రి జీన్ డిక్సన్ భవిష్య ద్వాణి చేయడంలో కూడా ప్రపంచ ప్రసిద్ధి గాంచింది. ఆమె చేసిన ఎన్నో భవిష్యద్వాణీలు ప్రపంచంలోని ప్రజల్లో సంచలనం కలిగించాయి. అందులో ముఖ్యమైనది అమెరికన్ ప్రెసిడెంట్ జాన్ కెన్నడీ హత్య గురించి ఆమె చెప్పిన భవిష్యద్వాణి.

జీన్ డిక్సన్ తనకు గల ఈ అలౌకిక శక్తిని దేవుడు ప్రసాదించిన వరంగా విశ్వసించేది. ఆమెకు పునర్జన్మ మీద కూడా అచంచలమైన విశ్వాసం వుండేది. తన జీవితంలో ఎన్నోమార్లు పునర్జన్మ అనుభూతి కలిగిందని ఆమె పేర్కొంది. "అటువంటి సమయంలో నేను భౌతిక, మానసిక బంధనాలన్నిటి నుంచి విముక్తి పొందినట్టు అలౌకిక ఆనందం లభించేది. పునర్జన్మ విశ్వాసం వల్ల నా అంతరాత్మ పొందే తృప్తిని, తాదాత్మ్య స్థితిని నేను మాటల్లో వర్ణించలేను. మృత్యువుకు, జీవితానికీ మధ్య సరిహద్దులన్నీ చెరిగిపోయిన అపూర్వక్షణాల్లో మనిషి అనిర్వచనీయమైన శాంతినీ, అలౌకిక ఆనందాన్ని అనుభవిస్తాడని నా నమ్మకం" అంటూ తన అనుభూతుల గురించి వివరించింది.

పునర్జన్మ గురించి ఆమెకు మొదటి అనుభవం క్రీ.శ.1962లో కలిగింది.

అప్పుడు రోమ్ నగరంలో క్రిస్మస్ వేడుకలు జరుగుతున్నాయి. అందులో పాల్గొనడానికి అమెరికా నుంచి జీన్ డిక్సన్ రోమ్‌కి వచ్చింది. రోమ్‌లో నివసించే ఆమె ప్రియ స్నేహితురాలు మేరీ సిస్లర్ ఆహ్వానం మీద ఆమె అక్కడికి చేరుకుంది.

అదృష్టవశాత్తు మేరీ సిస్లర్ నివాస స్థలం రోమ్‌లోని ప్రఖ్యాత పియాజానావోసా ఎదుటనే వుండేది. ఈ చారిత్రాత్మక చౌరస్తా మధ్యలో మూడు వైపులా తెరలతో అలంకృతమైన పొడవాటి షామియానా కట్టబడింది. షామియానా ప్రవేశ ద్వారంలో బాల జీసస్ బాల గృహం నిర్మించబడి ఉన్నాయి. అక్కడ వున్న చెట్లకు రకరకాల అందమైన కానుకలు వేళ్లాడదీయబడి వున్నాయి. అవి పిల్లలకు పంచి పెట్టడానికి ఉద్దేశించినవి.

రోమ్‌లో జరిగే క్రిస్మస్ వేడుకలు ప్రపంచ ప్రసిద్ధి గాంచినవి. సహజంగానే పిల్లలకు సంతోషప్రదమైన ఈ పండుగలో పిల్లలకు రకరకాల కానుకలు ఇవ్వబడతాయి. పియాజా నావోసా అందచందాల్ని చూసి జీన్ డిక్సన్ మనసు తన్మయంతో పులకించిపోయింది.

శ్రీమతి సిస్లర్ కుమారుడు పాల్ జీన్ డిక్సన్‌ని రోమ్ నగర విహారం కోసం ఆహ్వానించాడు. రోమ్‌లోని ప్రాచీన విగ్రహాలు, కళాకృతులు, తైలవర్ణ చిత్రాలు, ప్రాచీన చర్చిలు, ప్రఖ్యాత భవనాలు దర్శించాలని డిక్సన్‌కి ఎన్నాళ్లగానో తీరని కోరిక వుంది.

ఆవిడ పాల్ వెంట రోమ్ నగరంలో విహరిస్తున్నప్పుడు పాల్ అన్నాడు " మీరు రోమ్‌లోని జీసస్ పవిత్ర హృదయ కళాకృతిని తప్పక చూడాల్సిందే. అది చూడకపోతే మీరు రోమ్‌లో ఏమీ చూసినట్టు కాదు"

"అవును. ఆ కళాకృతి గురించి నేనూ విన్నాను. అయితే అది ఏ చర్చిలో వుంది "డిక్సన్ ఉత్సాహంగా అడిగింది.

"కాని మీరది చూడాలంటే బాగా కష్టపడాలి. ఎంతో దూరం నడిచి ఎన్నో మెట్లెక్కాలి. మీరు బాగా అలిసిపోతారనుకుంటాను"

అప్పుడే శ్రీమతి డిక్సన్ నోట్లోంచి అనాయసంగా వచ్చేసింది "చూడు పాల్ , ఆ కళాకృతి ఏ చర్చిలో వుందో నాకు తెలుసు. దానికి నువ్వు చెప్పినంత దూరం నడవాల్సిన పని లేదు. నువ్వు చెప్పినట్టు మెట్లు కూడా లేవు. చర్చిలోని మూడవ ఆవరణ. గోడ మీద అది అమర్చబడి ఉంది. ఈ గోడ పూజా స్థలం నుంచి స్పష్టంగా కనిపిస్తుంది. కళాకృతిని ఎక్కువ ఎత్తులో అమర్చలేదు గనక దాన్ని సునాయాసంగా దర్శించవచ్చు"

ఆమె మాటలు విని పాల్ ఆశ్చర్యపోయాడు. "ఆంటీ! మీరు చెబుతున్నది అబద్ధం. నేను రోమ్‌లో ఎన్నో ఏళ్లుగా వుంటున్నాను. మీరు వర్ణించిన ఆ చర్చిలో ఆ కళాకృతి లేదని ఖచ్చితంగా చెప్పగలను" అన్నాడు ధృఢ నిశ్చయంతో.

"పాల్ నేను చెప్పిందీ నిజం. కావాలంటే నిన్ను ఆ చర్చికి తీసుకెళ్లి ఆ కళాకృతిని చూపించగలను"

"కాని మీరు రోమ్‌కి మొదటిసారిగా వచ్చారు. మీకు చర్చి గురించి ఎలా తెలుసు?"

"ఈ జీవితంలో నేనా చర్చిని చూడకపోయినా ప్రాచీన కాలంలో నేనా చర్చిని ఎన్నోసార్లు దర్శించినట్టు నాకు గుర్తుకు వస్తోంది. బహుశా పూర్వజన్మలో చూసి వుంటానేమో"

"పూర్వ జన్మలోనా?"పాల్ ఉలిక్కిపడ్డాడు. శ్రీమతి డిక్సన్‌కి హఠాత్తుగా మతి భ్రమించిందేమో అని అతనికి అనుమానం వచ్చింది. అయినా ఆమె మాటల్లో నిజమెంతో కనుక్కుందామని అతను డిక్సన్ చూపిన దారిలోనే నడవసాగాడు.

శ్రీమతి డిక్సన్ ఆ ప్రాంతంలో తనకు చిరపరిచయమున్నట్టు చకచకా నడుస్తూ ఓ చోటికి చేరుకుంది. నిజంగానే అక్కడొక చర్చి వుండటం చూసి పాల్ ఆశ్చర్యపోయాడు.

శ్రీమతి డిక్సన్ ఎలాంటి సంకోచం ప్రదర్శించకుండా బాగా అలవాటు వున్న దానిలా చర్చిలోకి ప్రవేశించింది. పాల్ మంత్ర ముగ్ధునిలా ఆమెను సమీపించాడు. డిక్సన్ పూజా స్థలం వైపు వెళుతున్నప్పుడు మూడవ ఆవరణ గోడకు వేళ్లాడుతున్న జీసస్ పవిత్ర హృదయ కళాకృతి కనిపించింది. దాన్ని చూడగానే ఆమె భక్తిగా దాని ముందు నిల్చుని కళ్లు మూసుకుని ప్రార్థించసాగింది. పాల్ విప్పారిన కళ్లతో విస్మయంగా కళాకృతినే చూడసాగాడు.

శ్రీమతి డిక్సన్‌కి ఓ అనిర్వచనీయమైన ఆనందంతో ఒళ్లంతా పులకరించిపోయింది. ఆ ప్రదేశాన్ని గతంలో తను ఎన్నో మార్లు దర్శించినట్లు ఆమెకు అనుభూతి కలిగింది. కాని ఎప్పుడు ? ఎలా? అనే ప్రశ్నలకు జవాబు దొరకలేదు.

తర్వాత ఆమె అమెరికా చేరుకుని తన ఈ పునర్జన్మ అనుభూతి తన పుస్తకంలో వివరిస్తూ, ఇలా పేర్కొంది "పునర్జన్మ పట్ల నాకు మొదటి నుంచీ ఇంత ఆసక్తి ఎలా, ఎందుకు కలిగిందో నాకే తెలియదు. బహుశా మనసంతా భగవంతుని వైపు ఆకర్షితులు కావడానికి ఈ అంశం ఉపకరిస్తుందేమో. పునర్జన్మ రహస్యానుభూతి ముక్కచెక్కలైన మన జీవన ఆనందాన్ని ఒక్కటిగా పేర్చి, కాలం అఖండమైనదనీ, ఆత్మ అమరమైనదని మనకు విశ్వాసం కలగజేస్తుంది. ఆ విశ్వాసంతోనే జీవితపు అలౌకిక ఆనందం దాగి వుంది"

●●